
కథ


# అద్దమంటి హృదయం

- రాంభూపాల్‌రెడ్డి



ఇంటి మిద్దె మీద నిలబడి ఆకాశంకేసి చూస్తున్న లావణ్యా కనిపించగానే

''అదిగో లావణ్యా. మిద్దె మీద వుంది'' ఎక్జయిట్ అయిపోతూ అన్నాడు విజయ్.




''**నా**క్కూడా కనిపిస్తోంది. అంతగా టెన్షన్ పడకు. మనం ఇప్పుడు ఆమె దగ్గరకే కదా వెళ్ళేది'' చెప్పాడు శ్యామ్.

వీళ్ళిద్దరూ రావడం చూసి మెట్లు దిగి కిందికి వచ్చింది లావణ్య. పేరుకు తగ్గ సౌందర్యరాశి.

తెల్లటి పంజాబీ డ్రెస్‌లో మెట్లు దిగి వస్తున్న ఆమెను చూసి నింగినుంచి తనకోసం దిగివస్తున్న దేవతలాగా ఫీలయ్యాడు విజయ్.

''బాగున్నారా! హైదరాబాద్ నుంచి ఎప్పుడు వచ్చారు?'' నవ్వుతూ పలకరించిందామె విజయ్‌ను.

''ఈ రోజు ఉదయమే వచ్చాను'' చెప్పాడతను.

''రండి. లోపలికెళ్దాం'' అంటూ ఇంట్లోకి తీసుకెళ్ళింది ఇద్దరినీ.

వాళ్ళిద్దరినీ హాల్లో కూర్చోబెట్టి ఆమె లోపలికి వెళ్ళింది టీ తెస్తానంటూ.

లోపల్నించి లావణ్య వాళ్ళమ్మ ''ఎవరూ?'' అనుకుంటూ వచ్చింది. ''బాగున్నావా బాబూ'' అంటూ పలకరించింది విజయ్‌ను చూసి. బదులుగా తల ఊపుతూ చిన్నగా నవ్వాడు విజయ్. ఇంతలో లావణ్య ట్రేలో బిస్కట్లు, టీ పట్టుకొచ్చింది.

శ్యామ్ లావణ్యకు వరుసకు కజిన్ అవుతాడు. అతనికి వాళ్ళతో పరిచయమెక్కువ వుండటం వల్ల వాళ్ళతో ఫ్రీగా మాట్లాడుతున్నాడు. విజయ్ పరిస్థితి భిన్నంగా ఉంది. వాళ్ళమ్మ ముందు మాట్లాడటానికి అతనికి మొహమాటంగా వుంది. అతని మనస్సు లావణ్యతో కాస్సేపు ఫ్రీగా మాట్లాడాలని కోరుకుంటోంది. టీ తాగాక మెల్లగా శ్యామ్ చేతిమీద చిన్నగా తట్టాడు. అతనికి తెలుసు ఆ పరిస్థితి కల్పించగల చనువు శ్యామ్‌కు వుందని. శ్యామ్‌కు విజయ్ పరిస్థితి అర్థమయ్యింది.

లోపల రూమ్‌లో నుంచి టేప్ రికార్డర్‌లోంచి ఏదో పాట చిన్నగా వినిపిస్తోంది.

''ఏమైనా కొత్త క్యాసెట్లు కొన్నారా?'' అంటూ శ్యామ్ ఆ గదిలోనికి నడిచాడు.

''ఏమీ కొన్లేదు'' అని లోనికి వెళ్తూ మీరూ రండి అంటూ విజయ్‌ను పిలిచిందామె. లావణ్యకు తెలుసు విజయ్ తనను ఇష్టపడుతున్నాడని.

గదిలో శ్యామ్‌తో పాటు క్యాసెట్లు చూస్తూ నిలబడ్డాడు విజయ్.

అంతలో అతనికి ప్రక్కనే గోడమీద ఉన్న లావణ్య ఫోటో కనిపించింది. క్లోజప్‌లో మొహం మాత్రమే కనిపించేలా నవ్వుతూ ఉన్నప్పుడు తీసిన ఫోటో అది. అందంగా లామినేట్ చేయబడి ఉంది.

నవ్వుతూ ఉన్న ఆమె అందమైన మొహాన్ని చూస్తుంటే అతనికి మనసులో వెన్నెల కురుస్తూన్న తియ్యటి అనుభూతి కలిగింది. అతని దృష్టి ఫోటో చివర్లో వున్న అక్షరాల మీద పడింది.

''విత్ లవ్... శ్రీనివాస్'' అని రాసి వుంది. అది చూడగానే అతని మొహంలోని రంగులు మారిపోయాయి. మనసంతా చేదుగా అయిపోయింది.

అతను వాళ్ళతో బయటకు మామూలుగానే మాట్లాడుతున్నా లోపల మాత్రం ''శ్రీనివాస్'' గురించే ఆలోచిస్తున్నాడు. ''ఎవరతను? ఇంట్లో ఇంత బహిరంగంగా ఫోటోపై అతని పేరు వుందంటే ఇంట్లో అందరికీ అతని గురించి తెలిసే వుండాలి. లావణ్య కూడా అతన్ని ఇష్టపడుతుండాలి. లేకుంటే ఆ ఫోటో ఇక్కడెందుకుంటుంది.'' ఆ ఆలోచన కలుగగానే అతనికి తన గుండెనెవరో పదునైన కత్తితో కోస్తున్న భావన కలిగింది.

ఇక అక్కడ వుండలేక వెళ్ళొస్తానని చెప్పి శ్యామ్‌ను తీసుకుని బయటకు వచ్చేశాడు. ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు. విజయ్‌కు గుండెల్లో బాధ క్రమక్రమంగా పెరుగుతోంది.

''శ్రీనివాస్ గురించి ఆలోచిస్తున్నావా?'' ఉన్నట్టుండి అడిగాడు శ్యామ్.

''నీకు శ్రీనివాస్ గురించి ముందే తెలుసా?'' ఆశ్చర్యంగా అడిగాడు విజయ్.

''తెలుసు. నీవు లావణ్య మీద మనసు పడ్డావని తెలిసినప్పటి నుంచీ ఎప్పటికప్పుడు చెప్దామనుకున్నాను కానీ చెప్పలేకపోయాను.''

''ఎవరతను? ఎక్కడ వుంటాడు? అతనికీ లావణ్యకూ ఏమిటి సంబంధం?'' ఆతృతగా ప్రశ్నల వర్షం కురిపించాడు విజయ్.

''శ్రీనివాస్ లావణ్యకు డిగ్రీలో క్లాస్‌మేట్. వాళ్ళిద్దరూ ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. శ్రీనివాస్‌కు ఆస్థిపాస్తులు ఏమీ లేకపోవడం, కుటుంబ బాధ్యతలు ఎక్కువగా వుండటం వల్ల లావణ్య వాళ్ళ అమ్మా నాన్నలకు వాళ్ళిద్దరికీ పెళ్ళి చేయడం ఇష్టం లేకపోయింది. అందుకే ఆ ఊరి నుంచి వాళ్ళ కుటుంబమంతా ఈ ఊరికి వచ్చి దాదాపు సంవత్సరం కావస్తోంది. మొదట్లో ఇంట్లో వాళ్ళతో గొడవ పడుతూ అందరితోనూ మూడీగా ఉండేది. నేను అప్పుడప్పుడూ వస్తూ ఆమె శ్రీనివాస్‌ను మరచిపోయేలా చేసేందుకు సరదాగా కబుర్లు చెప్పేవాడిని. నిన్ను పరిచయం చేసిన తర్వాత ఎక్కువగా నీ జోవియల్ నేచర్ గురించీ, నీ జోక్స్ గురించీ చెప్పేవాణ్ణి. బాగా ఎంజాయ్ చేసేది. అందుకే నీవు వచ్చినప్పుడంతా నవ్వుతూ మంచిగా పలకరిస్తోంది'' అంటూ మొత్తం విషయం వివరించాడు శ్యామ్.

★★★

విజయ్‌కు నిద్ర రావటం లేదు. రేపే లావణ్య బర్త్‌డే. అసలందుకొరకే రెండ్రోజులు ఆఫీసుకు సెలవుపెట్టి మరీ వచ్చాడు. ఆదివారం కూడా కలిసి రావడంతో మొత్తం మూడు రోజులు దొరికింది.

అంతకు ముందు రోజు శ్యామ్ చెప్పిన విషయాలు అతనింకా జీర్ణించుకోలేకపోతున్నాడు. అసలు అప్పుడే హైదరాబాద్ వెళ్ళి


పోదామనుకున్నాడు. కానీ వెళ్ళలేక, వుండలేక సతమతమవుతున్నాడు.

శ్యామ్ ద్వారా లావణ్య పరిచయమైన రోజునే అతనికి ఆమెపై ఇష్టం ఏర్పడింది. అది ప్రేమగా మారి రోజు రోజుకూ పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు శ్రీనివాస్ విషయం తెలియడంతో సున్నితమైన అతని మనసు తట్టుకోలేకపోతోంది. కానీ ఒక్క విషయం మాత్రం అతనికి బాగా అర్థమవుతోంది. ''లావణ్య లేని జీవితాన్ని తాను ఊహించుకోలేడు. తనామెను ప్రేమించాడు. తనకు ఆమె కావాలి. అంతే తప్ప లావణ్యను ప్రేమించినప్పుడు ఆమె గతమేమిటని తను ఆలోచించలేదు. ముందు తన ప్రేమను ఆమెకు తెలియజేయాలి ఆమె నిర్ణయం ఏమైనా సరే. అందుకు రేపే సరైన రోజు.'' ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత అతనికి హాయిగా నిద్ర పట్టింది.

★★★

తలంటు పోసుకుని, దైవ ప్రార్థన ముగించుకుని రూమ్‌లో కూర్చుంది లావణ్య. ఆమె అన్ని పనులూ చేసుకుంటున్నా వాటిలో జీవంలేదు, ఆసక్తి కరువైంది, నిర్లిప్తత చోటు చేసుకొంది. ఎందుకో ఆమెకు విజయ్ గుర్తుకొచ్చాడు. ఆ రోజు తన ఫోటో చూసిన తర్వాత అతను మూడీగా మారడం, మళ్ళీ రాకపోవడం గుర్తుకు వచ్చాయామెకు. చిన్నగా నిట్టూర్చిందామె.

ఇంతలో దూరంగా తమ ఇంటివైపు వస్తున్న విజయ్ కనిపించాడామెకు కిటికీలోంచి. ఆమెకు కొద్దిగా ఆశ్చర్యమేసింది. ఇంతవరకూ అతనెప్పుడూ ఒంటరిగా వాళ్ళింటికి రాలేదు. ఆమె లేచి బయటికొచ్చి నిలబడ్డది.




గేటు తీసుకుని లోపలకు వస్తూ తలంటు పోసుకుని కడిగిన ముత్యంలా వున్న ఆమెను ఒక్క క్షణం కన్నార్పకుండా చూశాడతను.

చేతిలోని గ్రీటింగ్ కార్డు ఆమెకిస్తూ ''మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే'' అంటూ బర్త్‌డే విషెస్ చెప్పాడు.

ఇద్దరూ హాల్లో కూర్చున్నారు. ఇద్దరికీ ఇబ్బందిగా వుంది. ఒకరి మనసులో ఏముందో ఇంకొకరికి తెలుసు.

లావణ్య గ్రీటింగ్ కార్డు వోపెన్ చేసింది. లోపల చిన్న లెటర్ ఒకటి అతికించి వుంది. ''మీరంటే నాకిష్టం. మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. మీకు అంగీకారమైతే ఈ రోజు సాయంత్రం 6.00 గంటలకు గుడికి రండి. లేదంటే మీ దగ్గర ఇంకెప్పుడూ ఈ ప్రస్తావన తీసుకురాను'' అని రాసి వుందందులో.

లావణ్య తలెత్తి విజయ్ కళ్ళల్లోకి చూసింది. విజయ్ మౌనంగా వెళ్ళొస్తానన్నట్టు తలవూపి బయటకు నడిచాడు.

ఆమెకు శ్రీనివాస్ గుర్తుకు వచ్చాడు. అతనితో గడిపిన మధుర క్షణాలు గుర్తుకు వచ్చాయి. అవి మళ్ళీ రావని తెలుసు. ''తన హృదయం ఇప్పుడు పగిలిన అద్దం లాంటిది. ఇప్పుడు తను కాదంటే విజయ్ పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. ప్రేమించిన వ్యక్తిని పొందలేని బాధ ఎంత దుర్భరంగా వుంటుందో తనకు తెలిసీ ఇప్పుడు ఇంకో మనసును క్షోభ పెట్టడం ఎంతవరకూ సమంజసం'' ఆలోచిస్తోంది.

OOO

గుళ్ళో ఒక మూల కూర్చున్న విజయ్ చాలా ప్రశాంతంగా కనిపిస్తున్నాడు. అతని మనసులో మాత్రం లావణ్య వస్తుందో, రాదోనని భయం తాలూకు నీడలు కదలాడుతున్నాయి. సరిగ్గా ఆరు అవుతుందనగా గుడి మెట్లెక్కి లోపలికి వస్తున్న లావణ్య కనిపించింది. గుళ్ళోనూ, అతని గుండెలోనూ ఒకేసారి గంటలు మ్రోగాయి.

